క్లుప్తంగా

ఆరోగ్య సమాజ కోసం జగనన్న ఆరోగ్య సురక్ష



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యకర సమాజ స్థాపన కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. గులాబీతోట 200వ వార్డు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం జరిగింది. ముఖ్య అతిథి మల్లీశ్వరి మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నారని పేర్కొన్నారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, వార్డు సచివాలయం సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకుడు కె.రాము తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి అనకాపల్లికి చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. అనకాపల్లి పెరుమాళ్ల వీధికి చెందిన శ్రీనాథు శ్రీనివాసరావు దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,002 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం, దేవస్థాన ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీలు



రెండో ట్రాఫిక్ ఏసీపీ వంశీధర్‌గౌడ్



హోం గార్డ్ ఏసీపీ పరమేశ్వరరావు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెండో ట్రాఫిక్ ఏసీపీగా వంశీధర్‌గౌడ్, హోం గార్డ్స్ ఏసీపీగా కె.వి.ఎస్.ఎన్.పరమేశ్వరరావు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా వంశీధర్‌గౌడ్ మైదుకూరు నుంచి, పరమేశ్వరరావు హైదరాబాద్‌లోని ఏపీ యూనిట్ నుంచి జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు వచ్చారు. తమ కార్యాలయాల్లో వారు బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల నోడల్ ఆఫీసర్ యు.శ్రీనివాసరావు సూచించారు. ఎస్ఆర్ఆర్ కళాశాలలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు జిల్లా యూత్ సంక్షేమ అధికారి, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో బుధవారం ఓటర్ అవగాహన సదస్సు జరిగింది. యువత ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని శ్రీనివాసరావు సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాసరావు, శాంతిబాయి, వలంటీర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం 300 మంది పేదలకు అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక, బ్రహ్మదేశం వసంతకుమార్, మక్బుల్, వెంకట్ పాల్గొన్నారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా మద్యం, బీర్ బాటిల్స్‌ను విక్రయిస్తున్న వ్యక్తిని కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పోలవరం కాలువ వద్ద ఎస్ఐ రాజనరేంద్ర, తన సిబ్బందితో బుధవారం గస్తీ నిర్వహిస్తుండగా, ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఆతడిని పి.నైనవ రానికి చెందిన కోసూరి నాగరాజుగా గుర్తించారు. నిందితుడి వద్ద లభించిన చేతి సంచిలో 12 బీరు బాటిళ్లు, ఆరు మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితుడి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ పాలనలో మెరుగైన ప్రజారవాణా

ఎంపీ కేశినేని నాని



మినీ బస్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషిచేస్తోందని ఎంపీ కేశినేని నాని అన్నారు. వాంబేకాలనీలో రూ.2 కోట్లతో చేపట్టిన మినీ బస్ స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ.. ఒక మోడల్ బస్ స్టేషన్‌గా వాంబేకాలనీ బస్ స్టేషన్‌ను తీర్చిదిద్ది, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకునేలా చూస్తామన్నారు. ఎన్టీఆర్ హయాంలో శాతవాహన ప్రయాణ ప్రాంగణాన్ని నిర్మాణం చేసుకోగా, 41 ఏళ్ల తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వాంబేకాలనీలో బస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు.

అడిగిన వెంటనే నిధులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. నగరం విస్తరించి అజిత్ సింగ్ నగర్ ప్రాంతం అన్నింటికీ కేంద్ర బిందువుగా మారిన ప్రస్తుత తరుణంలో బస్ స్టేషన్ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం ఏర్పడుతుందన్నారు. బస్టేషన్ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెను వెంటనే రూ.5 కోట్లు మంజూరు చేయడంతో పాటు ప్రాథమికంగా రూ.2 కోట్లు విడుదల చేశారని తెలిపారు. రెండెకరాల విస్తీర్ణంలో ఐదు ప్లాట్‌ఫారాలతో ఈ మినీ బస్ స్టేషన్‌ను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు లక్షమంది నివాసం ఉంటున్నారని, మరో 22 వేల మందికి నున్న, సూరంపల్లి, కొండపావులూరు, జి.కొండూరు తదితర ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు చెప్పారు. ఈ మినీ బస్ స్టేషన్ నిర్మాణం జరిగితే వారందరికీ సులభతర రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఎవరెంత మంది కలిసి వచ్చినా, వచ్చే ఎన్నికల్లో ప్రజల చల్లని దీవెనలతో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్ హయాంలోనే..

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడూ నగర అభివృద్ధిపై దృష్టి సారించలేదని విమర్శించారు. అమరావతి పేరుతో నగర ప్రజలను మోసం చేశారు తప్ప విజయవాడ అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించిన పాపాన పోలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సకల హంగులతో నగరాన్ని తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. రూ.500 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మించి ప్రారంభించి చూపారన్నారు. నగర అభివృద్ధికి రూ.150 కోట్ల స్పెషల్ ఫండ్స్ కేటాయించినట్లు చెప్పుకొచ్చారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపినాథ్ రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం, నాయకులు, పార్టీ శ్రేణులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రాత్రి 62వ డివిజన్లో పేదలకు నిషేధిత జాబితా నుంచి మినహాయించిన ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు, న్యూ రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. పేదలకు మంచి చేసేదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. చంద్రబాబు, లోకేష్, బొండా ఉమా ఏనాడైన పేదల కష్టాలను చూశారా అని ప్రశ్నించారు. మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. సెంట్రల్ నియోజకవర్గంలోని పేదలకు నున్న, సూరంపల్లి, కొండపావులూరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. 22(ఏ)నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్లకు జగనన్న ప్రభుత్వం మినహాయింపు నిచ్చి పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ చేసి ఇంటి పట్టాలను ఇస్తోందన్నారు. రూ.1.20 కోట్లతో నిర్మించిన కాపు కళ్యాణ మండపం గురువారం ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. తెలుగుదేశం ఏనాడూ ప్రజలకు ఉపయోగ పడే పనులు చేయలేదని విమర్శించారు. అనంతరం 63,64వ డివిజన్లలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్, బుజ్జి, కార్పొరేటర్లు మోదుగుల తిరుపతమ్మ, యరగొర్ల తిరుపతమ్మ, పార్టీ నాయకులు మోదుగుల గణేష్, యరగొర్ల శ్రీరాములు, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కుసుమ ధర్మన్న సాహిత్యానికి ప్రచారం కల్పించాలి



మాట్లాడుతున్న సూరేపల్లి రవికుమార్, కలిమిశ్రీ సత్యస్వాతి, రాఘవేంద్ర చంద్రశేఖర్

విజయవాడ కల్చరల్: ఆంధ్ర ఆదిమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు, సాహితీవేత్త కుసుమ ధర్మన్న సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించాలని నవనిర్మాణ సంఘం వ్యవస్థాపక చైర్మన్ సూరేపల్లి రవికుమార్ కోరారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధర్మన్న తొలి అంబేడ్కరిస్ట్ అని, మాకొద్దీ నల్లదొర తనం అని నినదించిన సాహితీవేత్త అని కొనియాడారు. మార్చి 17వ తేదీ ఆయన జయంతి అని తెలిపారు. భాషా సాంస్కృతికశాఖ, తెలుగు అకాడమీ, అధికార భాష సంఘం సంయుక్తంగా ధర్మన్న జయంతి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. కుసమ ధర్మన్న తొలి పురస్కార గ్రహీత కలిమిశ్రీ మాట్లాడుతూ.. ధర్మన్న పేరుతో సాహితీ పీఠం ఏర్పాటు చేయాలని, ఆయన స్వస్థలం రాజమండ్రిలో పుష్కర ఘాట్‌లో ఆయన శిలా విగ్రహం ఏర్పాటు చేయాలని, విశ్వవిద్యాలయాల్లో స్మారక ఉపన్యాసం ఏర్పాటు చేయలని కోరారు. సమావేశంలో ఆశీష్ ఫౌండేషన్ చైర్మన్ సత్యస్వాతి, నవ్యాంధ్ర రచయితల సంఘం కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక శ్రీ బుధవ్రతం



సామూహిక శ్రీ బుధవ్రతం నిర్వహిస్తున్న శివజ్ఞాన పీఠాధిపతి శివాచార్యస్వామి

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠం ఆధ్వర్యాన బుధవారం సీతారాంపురం చాపరాల వారి వీధిలో లోక కల్యాణార్థం సామూహిక శ్రీ బుధ వ్రతం ఘనంగా జరిగింది. శ్రీ శివజ్ఞాన పీఠాధిపతి శ్రీ శివాచార్యస్వామి శ్రీ బుధవ్రతాన్ని భక్తులతో సంప్రదాయబద్ధంగా చేయించారు. శ్రీ బుధవ్రతం విశిష్టతను భక్తులకు వివరించారు. ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని లోకకల్యాణార్థం ఉచితంగా శ్రీ బుధవ్రతం ఏర్పాటు చేశామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పాత్తూరు వంశీకృష్ణ, లక్ష్మీరాధిక, పీఠం ఆర్గ నైజర్ పేర్ల శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొల్ల రామాయణంలో సాహిత్య విలువలు మెండు



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాగ్యలక్ష్మి తదితరులు



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సుప్రసిద్ధ కవయిత్రి మొల్లమాంబ తేట తెలుగు భాషలో రచించిన రామాయణం పద్య కావ్యంలో సాహిత్య విలువలు మెండుగా ఉన్నాయని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి సంస్కృతంలో విరచించిన శ్రీమద్రామాయణాన్ని ఆధారంగా చేసుకుని మొల్ల తెలుగులో రాసిన రామాయణం పద్యకావ్యం సరళమైన భాషలో ఉందన్నారు. 16వ శతాబ్దానికి చెందిన మొల్లమాంబ సాధారణ కుటుంబంలో జన్మించి ఎటువంటి సంప్రదాయ విద్యను అభ్యసించలేదని, దైవానుగ్రహంతో వచ్చిన సహజ పాండిత్యంతోనే రామాయణాన్ని రచించిందని చెప్పారు. మొల్లమాంబ వంటి పూర్వీకుల గురించి నేటి తరం తెలుసుకోవల్సిన అవసరం ఉందన్నారు. కీర్తి ప్రతిష్టల కోసం తాను నాడు రచించిన రామాయణాన్ని ఏ రాజుకూ అంకితం ఇవ్వలేదని, కేవలం తన రామభక్తిని చాటుకునేందుకు మాత్రమేనని తెలిపారు. తెలుగు సాహిత్యంలో మొల్లమాంబ చేసిన కృషిని మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ.మహేష్, మేనేజర్ బి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మొల్లమాంబ జీవితం ఆదర్శనీయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): కవయిత్రి మొల్లమాంబ జీవితం ఆదర్శనీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి డీఎంహెచ్ఓ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. తేట తెలుగు పద్యకావ్యం మొల్ల రామాయణమని కొనియాడారు. ఆమె జీవిత చరిత్ర వంటి విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా స్టాటిస్టికల్ ఆఫీసర్ లక్ష్మోజీ మొల్లమాంబ గద్యం చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, డాక్టర్ సమీర, డాక్టర్ శ్రావణి, డెప్యూటీ డెమో ప్రభాకర రెడ్డి, డెప్యూటీ ఎస్ఓ గోపాలకృష్ణ, డి.సత్యనారాయణరెడ్డి, భాగ్యరాజు, జూనియర్ అసిస్టెంట్ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలికి కొవ్వొత్తులతో నివాళి



క్యాండిల్స్‌తో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ విజయవాడ అయోధ్య నగర్‌లో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి గునుపూడి చందు ఆధ్వర్యంలో గురువారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఇంటి పట్టా వచ్చిందన్న ఆనందంలో తన సంతోషాన్ని పంచుకున్న గీతాంజలిపై ఐటీడీపీ వారు సైకోల్లా వ్యవహరించి ఆమె ప్రాణాలు తీసుకునేలా చేశారన్నారు. వారి ఆగడాలను అరికట్టాల్సిన అవసరం ఉందని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మహిళల పట్ల అసభ్య పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటీడీపీ వింగ్ నారా లోకేష్ సారథ్యంలోనే జరుగుతోందని, గీతాంజలి మృతికి లోకేష్ కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం క్యాండిల్స్ చేతబూని గీతాంజలికి నివాళులర్పించారు. కార్యక్రమంలో 32వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుండె సుందర్ పాల్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణి రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్, గునిపూడి చందు, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కట్నం కోసం వేధింపులపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన భర్త నిత్యం మద్యం తాగి, అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఓ మహిళ బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. గుణదల ఊర్మిళనగర్ కృష్ణా హోటల్ సెంటర్ ప్రాంతానికి చెందిన విశ్వనాథపల్లి జగదీష్‌బాబు, శ్యామలకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక పాప ఉంది. జగదీష్‌బాబు మద్యంతాగి అదనపు కట్నం తీసుకురావాలంటూ శారీరకంగా, మానసికంగా భార్య శ్యామలను వేధిస్తున్నాడు. శ్యామల బుధవారం సాయంత్రం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్‌ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష కిట్‌లను అందజేస్తున్న సీఐ వెంకట నారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఏకేటీపీఎం హైస్కూల్ 1983–84 పూర్వ విద్యార్థుల ఆధర్యంలో బుధవారం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 310 మంది విద్యార్థులకు పరీక్ష కిట్‌లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎన్‌పురం సీఐ వెంకట నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఇష్టంతో చదువుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పింగళి రాయల్, ఉపాధ్యాయులు ప్రభాకరరావు, టి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

41వ డివిజన్‌లో జనగన్న ఆరోగ్య సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గంలోని భవానిపురం 41వ డివిజన్ 120వ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. ప్రజలంతా వినియోగించుకోవాలని సూచించారు. హెల్త్ సెంటర్ డాక్టర్ నిరుపమ, ఏఎన్ఎం ఝాన్సీ, సచివాల సిబ్బంది, వలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుణదల ఆర్వోబీ పనులు పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సర్వే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గుణదల(విజయవాడ తూర్పు): గుణదల వంతెన ప్రాంతంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గుణదల వంతెన సెంటర్‌లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుణదల ప్రాంతంలో ఆర్వోబీ, ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. నూరు శాతం రైల్వే నిధులతో గతిశక్తి ప్రాజెక్టు కింద చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఢిల్లీలోని రైల్ భవన్‌లో రైల్వే బోర్డు చైర్ పర్సన్ జయవర్మ సిన్హాను ఇటీవల కలిశామని తెలిపారు. స్థానిక ట్రాఫిక్ సమస్య, ఫ్లై ఓవర్ నిర్మాణంపై చర్చించినట్లు పేర్కొన్నారు. రైల్వే శాఖ సానుకూలంగా స్పందించి ఆర్వోబీ నిర్మాణానికి సర్వే నిర్వహించి అంచనాలు సిద్ధం చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. ఇప్పటికే రూ.12.50 కోట్లకు సంబంధించిన భూసేకరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు పూర్తి చేసిందని తెలిపారు. రైల్వే అధికారుల సర్వేలో భాగంగా గుణదలలో పర్యటించి సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావుతో ఆర్వోబీపై చర్చించామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వచ్చే జూన్ మాసం కల్లా ఆర్వోబీ పనులు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్ రెడ్డి, ఉద్దంటి సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

గుణదల(విజయవాడ తూర్పు): ప్రపంచ భాషల్లో తెలుగుకు ప్రత్యేకత ఉందని ఇగ్నో సీనియర్ రీజనల్ డైరెక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ అన్నారు. ఆంధ్రలయోల కళాశాలలో తెలుగు సాహిత్యంపై బుధవారం జాతీయ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి రామాంజనేయశర్మ మాట్లాడుతూ.. ప్రాచీన భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. దేశాన్ని పాలించిన చక్రవర్తులు, మహారాజులు సైతం తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించారని పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయలు తెలుగును దేశ భాషలందు తెలుగు లెస్స అని కీర్తించాడని గుర్తు చేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని నేటి తరం గుర్తించాలని కోరారు. కవులు, రచయితలు తమ రచనల ద్వారా ప్రజల్ని చైతన్య వంతులను చేయాలని సూచించారు. తెలుగు భాష విశిష్టతను తెలుసుకోవడానికి ఇటువంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం తెలుగు భాష ప్రత్యేకతలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, తెలుగు అధ్యాపకుడు గుమ్మా సాంబశివరావు, తెలుగు విభాగాధిపతి కోలా శేఖర్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఐ నాగరత్నం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో మానవ అక్రమ రవాణా ఒకటని, దాని వల్ల ఎంతో మంది అమాయకుల జీవితాలు బలవుతున్నాయని కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, ఎస్ఐ నాగరత్నం ఆందోళన వ్యక్తంచేశారు. మానవ అక్రమ రవాణా నివారణకు కృషి చేయాలని కోరారు. స్థానిక దుర్గాపురంలో బుధవారం ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ఎలా జరుగుతుందో వివరించారు. విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని, అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు కె.రాము, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు

కోర్టు ప్రాంగణంలో వృద్ధురాలి మృతి

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ న్యాయ స్థాన భవనాల ప్రాంగణంలో వృద్ధురాలు పంచకర్ల విజయలక్ష్మి (70) గుండెపోటుతో బుధవారం మృతి చెందినట్లు సూర్యారావుపేట సీఐ బి.దుర్గారావు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో వాయిదాకు హాజరయ్యేందుకు ఆమె కోర్టుల ప్రాంగణానికి వచ్చిందని, కొద్ది సేపటికే ఆపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందిందని పేర్కొన్నారు. మృతురాలు విజయవాడ కస్తూరిబాయిపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. వార్డు వలంటీర్ రామగణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.